కరాటేలో సత్తా



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

అబిడ్స్: స్టేట్ లెవెల్ చాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో శ్రీ వివేకానంద విద్యా విహార్ విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అవినాష్, ప్రదీప్, రిషి, రిషిత, అభిషేక్, హర్షిత్‌లు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



ఆశీష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

అబిడ్స్: బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్‌లో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం

మణికొండ: ఓ ఫర్నిచర్ తయారు చేసే గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌వాసులు ఉరుకులు పరుగులు పెట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కూలీకుదుబ్‌షా కాలనీలో ఓ వ్యాపారి ఫర్నిచర్ తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. రోజు మాదిరిగానే సిబ్బంది పని చేస్తుండటంతో ఉన్నట్టుండి మంటలు అంటుకున్నాయి. లెదర్, కట్టెలు, ఫోం లాంటి పదార్థాలు ఉండటంతో గోదాం మొత్తం వ్యాపించాయి. అప్పటికే అగ్నిమాపకశాఖ, నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారొచ్చి మంటలను ఆర్పేశారు. పక్క అపార్ట్‌మెంట్‌లో ఉన్న రెండు కార్లు వేడికి వెనకభాగం దెబ్బతినగా పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌కు ఉన్న రెండు ఏసీలు ఔట్‌డోర్‌లు కాలిపోయాయి.

అంగన్‌వాడీ చిన్నారుల ఫొటోలు యాప్‌లో నమోదు

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫొటోలను పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి చిన్నారి వివరాలను ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లో నమోదు చేస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఫొటోలను క్యాప్చర్ చేస్తూ ఈ యాప్‌లో అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంత మంది పిల్లలు వస్తున్నారు, రోజూ హాజరవుతున్నారా? లేదా, వారికి పోషకాహారం అందిస్తున్నారా లేదా తదితర వివరాలన్నీ ప్రభుత్వానికి తెలిసేవిధంగా ఈ నమోదు కార్యక్రమం జరుగుతుంది.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చంద్రమోహన్ గౌడ్

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న సూచించారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫలక్ నుమా సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణంపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ..బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజా, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురా డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

చాంద్రాయణగుట్ట: గౌలిపురా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి జి.చంద్రమోహన్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం చాంద్రాయణగుట్ట పూల్‌బాగ్‌లోని కార్యాలయంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో నెలకొన్న సమస్యలతో ప్రజలు నిత్యం సతమతమవుతున్నారన్నారు. గుంతలమయంగా మారిన రహదారులు, నోళ్లు తెరిచిన మ్యాన్ హోళ్లు, పడకేసిన పారిశుద్ధ్యం, ఫుట్‌పాత్‌ల కబ్జా లాంటి సమస్యలు నెలకొన్నాయన్నారు. ఛత్రినాక చౌరస్తాలో ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించాలన్నారు. వైన్స్, బార్ల ముందు అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

సత్కారం



మద్దూరి రాజ్యశ్రీ, కస్తూరి వీర రాఘవరావును సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: అజో–విభొ–కందాళం–ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నందమూరి తారక రామారావు కళా మందిరంలో స్వామి పరమార్థనందజీ బోధనల స్ఫూర్తితో ప్రస్థానత్రయ మహా గ్రంథములను తెనుగున ప్రచురించి ప్రచార సేవలందిస్తున్న పుణ్య దంపతులు మద్దూరి రాజ్యశ్రీ–కస్తూరి వీర రాఘవరావు అభినందన సభ జరిగింది. కవి రాజహంస ఆచార్య అనుమాండ్ల భూమయ్య అధ్యక్షతన జరిగిన సభకు ఆర్షవిద్యా తరంగిణి సంచాలకులు–కాకినాడ డాక్టర్ ఎం.వి.ఆర్.శర్మ, ఇంజినీరింగ్ కళాశాల విశ్రాంతాచార్యులు హైదరాబాద్ డాక్టర్ బుర్రా రామచంద్ర శాస్త్రి, ఆర్షానంద కుటీరం హైదరాబాద్ రావులపర్తి రాజేశ్వరి, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా మద్దూరి రాజ్యశ్రీ–కస్తూరి వీర రాఘవరావులను సత్కరించారు. అభినందన సభానంతరం అప్పాజోస్యులవారి 'అంతరిక్ష వృత్త తారావళి'పద్య కృతి, ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి 'మిత్రవ్యాఖ్య'గ్రంథాల ఆవిష్కరణ జరిగింది.

కులగణన సర్వేలో అందరూ భాగస్వాములు కావాలి



లంగర్‌హౌస్‌లో పర్యటిస్తున్న నిరంజన్ తదితరులు

లంగర్‌హౌస్: కులగణన సర్వేలో అందరూ భాగస్వాములు కావాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించి ప్రకటించిన కులగణన వివరాలు తప్పులతడక అని విమర్శలు తలెత్తుతుండగా మరోసారి పూర్తి సర్వేకు అవకాశం కల్పించింది. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిరంజన్ లంగర్‌హౌస్‌లో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. లంగర్‌హౌస్ సంగం రాంచంద్రజీ మఠం ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం బాపూ సమాధికి నివాళులర్పించారు. బాపూఘాట్ నుంచి వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులతో కలిసి పాదయాత్రగా తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కులగణన జరగని వారు వార్డు కార్యాలయంలో కాని టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111 నెంబర్‌కు సమాచారం ఇస్తే సిబ్బంది వచ్చి వివరాలు సేకరిస్తారన్నారు. ఈ నెల 28 వరకు ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చిందని అందరు ఈ సర్వేలో పాల్గొనాలని ఆయన సూచించారు .ఈ కార్యక్రమంలో బీ–బ్లాక్ అధ్యక్షుడు చంటిబాబు, శేఖర్, పరమానందం, శ్రీకాంత్, మాధవి, అలీం పాల్గొన్నారు.

బలమైన సైనిక శక్తిగా భారత్



పురస్కార గ్రహీతలతో విశ్రాంత ఐఏఎస్ అధికారి పార్థసారథి తదితరులు

గన్‌ఫౌండ్రీ: అబ్దుల్‌కలాం లాంటి గొప్ప శాస్త్రవేత్తల కృషి వల్ల ప్రపంచంలోనే 4వ బలమైన సైనిక శక్తిగా భారతదేశం ఎదిగిందని రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో ప్రాజ్ఞిక ఆర్ట్స్ అకాడమీ 9వ వార్షికోత్స వేడుకలు, జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో దేశరక్షణకు ఆయుధాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవాళ్లమని, కానీ నేడు మన శాస్త్రవేత్తల కృషితో మనమే గొప్ప శక్తిగా ఎదిగామని తెలిపారు. అనంతరం డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్తలు శివపాల్‌సింగ్, ఎంఎల్.నారాయణ, డాక్టర్ ఎస్ఎస్ కల్యాణ్ కమల్, డాక్టర్ ఎస్‌వి.రామారావులకు ప్రాజ్ఞిక–సీల్‌వెల్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు గాయనీ గాయకుల సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి, ప్రాజ్ఞిక వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత కళల్లో చిన్నారులను ప్రోత్సహించాలి



నాట్య గురువు విమల నీలంను సన్మానిస్తున్న నటీమనులు రాగిని తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాంస్కృతిక సంస్థ విజయ మాధవి సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కళాభవన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి డ్యాన్స్ ఫెస్టివల్ ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్ మాట్లాడుతూ..చిన్నప్పటి నుంచే విద్యార్థులను శాస్త్రీయ సంగీత కళల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం నాట్య గురువు విమల నీలంను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీ నటీమనులు రాగిని, జ్యోతిరెడ్డి, సంస్థ వ్యవస్థాపకురాలు విజయమాధవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి బస్తీల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మొఘల్‌పురా కార్పొరేటర్ నస్రీన్ సుల్తానాతో కలిసి సోమవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికంగా కొనసాగుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లోని క్యూబా మసీద్, సుల్తాన్ షాహి, మొఘల్‌పురా ప్రాంతాల్లో నూతన డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను చేపట్టామన్నారు. బస్తీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో మజ్లిస్ పార్టీ అమన్ నగర్–బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్, నాయకులు, జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్: అకారణంగా తమపై దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకో వాలని అఫ్జల్‌గంజ్‌లోని మజీద్ ఏ ఛమన్ అధ్యక్షుడు యునిస్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రతినిధు లు బృందం సోమవారం అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అఫ్జల్‌గంజ్ మార్కెట్‌కు సంబంధం లేని కొంత మంది తమపై అకారణంగా దాడి చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

గంజాయి విక్రేత అరెస్టు

అత్తాపూర్: గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ సమీపంలో రాంబాగ్ కాలనీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకు న్న ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి 1.6 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. విశాల్‌సింగ్‌ను అరెస్టు చేశామని అశ్విన్, నవీన్ పరారీలో ఉన్నట్లు టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

28 నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయదుర్గం: గోపన్‌పల్లితండాలో ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయంలో ఉదయం గోపూజ, అఖండ దీపారాధన, గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, సాయంత్రం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తు పూజ, అంకురార్పణ శాంతి హోమాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 7 గంటలకు సర్వదేవతా మండప ఆరాధన, కలశ ఆరాధన, పంచగవ్యాదివాసం, క్షీరాదివాసం, జలాదివాసం, ప్రధాన హోమాలు, సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి ఊరేగింపు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం సర్వదేవతా మండప ఆరాధన, మహాపూర్ణాహుతి, బోనాల సమర్పణ, ఒడిబియ్యం, అన్నదానం, సాయంత్రం 6 గంటలకు సామూహిక కుంకుమార్చన, రాత్రి 7.30 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు రావాలి

రాయదుర్గం: గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని కలామ్ స్ఫూర్తి యాత్ర నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కలామ్ స్ఫూర్తి యాత్రను ముగించుకొని సోమవారం టీ వర్క్స్‌కు చేరుకున్న వారిని ఘనంగా సత్కరించారు. టీ వర్క్స్ ప్రాంగణంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఇంటీరియమ్ సీఈఓ మెరాజ్‌ఫహీమ్ పూలమాలలతో సత్కరించారు.

విద్యార్థులకు చేతి రాత ప్రాముఖ్యతను తెలియజేయాలి

గన్‌ఫౌండ్రీ: అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చేతి రాత పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ వికాస పరిషత్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ బీవీపీ సంస్కార్ మాట్లాడుతూ..విద్యార్థులకు చేతి రాత ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో చేతిరాతను పెంపొందించడంతో పాటు చేతిరాతపై ఆసక్తిని పెంచేందుకు దోహదపడుతాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వికాస పరిషత్ సలహాదారులు సాధనాచారి, అకాడమీ నిర్వాహకులు అహ్మద్, బి.సుదర్శన్, చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో సాధనాచారి తదితరులు

బల్దియా కార్మికులను పర్మనెంట్ చేయాలి



డిమాండ్ల పత్రాన్ని ప్రదర్శిస్తున్న నాయకులు

గోల్కొండ: బల్దియాలోని వివిధ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు సి.మల్లేష్, విఠల్ డిమాండ్ చేశారు. సోమవారం నగర సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్‌తో కూడిన పత్రాన్ని వారు బల్దియా జోనల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బల్దియా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేటగిరీలను అనుసరించి వారికి వివిధ విభాగాల్లో జీతాలు చెల్లించాలన్నారు. కార్మికుల హాజరుపట్టిలో జరుగుతున్న అవకతవకలను నివారించి అధికారుల వేధింపులను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, యాదమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

జీఎన్ఐటీఎస్‌లో సైబర్ థ్రెట్‌పై అవగాహన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: సైబర్ సెక్యూరిటీలో తాజా పురోగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో సైబర్ థ్రెట్ ఇంటెలిజెన్స్, అటాకర్ బిహేవియర్ అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యావేత్తలు, అధ్యాపకులతో పాటు పరిశోధకులు సైతం చోటు చేసుకుంటున్న మార్పులను తెలుసుకోవాలన్నారు. సైబర్ అటాకర్స్ బిహేవియర్ ప్రొఫైలింగ్ డిటెక్షన్, లిటిగేషన్‌తో పాటు సైకాలజికల్ లాంటి అంశాలను తెలుసుకోవడం ఎంతో మంచిదని ఆయన అన్నారు. అనంతరం ఈ అంశంపై కొత్తగా వచ్చిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్మన్ జి.శ్రీవిద్యారెడ్డి, ఐటీ విభాగం హెచ్‌వోడి డాక్టర్ రామ్‌చరణ్, డాక్టర్ శేష భార్గవి, డాక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, డి.వందన, ఎం. శ్రీదేవి తదితరులున్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: తలసేమియా సికిల్ సెల్ సొసైటీ, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గుడిమల్కాపూర్ కింగ్స ప్యాలెస్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని తలసేమియా రోగులకు అందిస్తామని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాతలను అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తెలంగాణలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సంఖ్య, వారికి అందుతున్న రక్తం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రత్నవలి కొత్తపల్లి, సుమన్ జైన్, అబు అమైల్ తదితరులున్నారు.

విద్యార్థులను నూతన యుగ ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న బెల్లంకొండ రాజశేఖర్

చార్మినార్: విద్యార్థులను నూతన యుగ ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ మేనేజ్మెంట్ విభాగం ఆచార్యులు బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. సిటీ కాలేజీ కామర్స్ మేనేజ్మెంట్ విభాగం 'సుస్థిర ఆర్థికాభివృద్ధి–ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణ'అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు పలు రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాయని, అలాంటి అంశాలపై అవగాహన కల్పించడంతో విద్యార్థులను స్థిరమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన భవిష్యత్తుకు సన్నద్ధం చేయవచ్చని సూచించారు. మహాత్మా గాంధీ వీవీ కామర్స్ డీన్ ఆచార్య ఆకుల రవి మాట్లాడుతూ..ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో ప్రతి దేశం పారిశ్రామికీకరణ పేరుతో పురోగమనాన్ని అనుసరిస్తోందని, అయితే, ఈ ప్రక్రియను సమీక్షించి, పర్యావరణానికి అనుకూలమైన, స్థిరమైన ఆవిష్కరణలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. ముగింపు సభకు వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా అధ్యక్షత వహించారు. సదస్సు కన్వీనర్ డా.మల్లికార్జున రావు రెండు రోజుల సదస్సు నివేదికను సమర్పించారు. డా.ఝాన్సీ రాణి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో డా.జె.నీరజ, ఇఫత్ ఉన్నీసా, డా.కృష్ణవేణి, డా.రవీంద్రబాబు, లలిత చైతన్య పాల్గొన్నారు.

నిత్య పరిశోధకుడు, బహుభాషా వేత్త నలిమెల భాస్కర్



పురస్కారం అందుకున్న నలిమెల భాస్కర్‌తో పలువురు ప్రముఖులు

చార్మినార్: ఆధునిక తెలుగు సాహిత్యంలో పరిశోధకుడిగా, బహుభాషావేత్తగా, అనువాదకుడిగా, రచయితగా విశేషంగా కృషి చేసి డాక్టర్ నలిమెల భాస్కర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార ప్రదాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిత్యానందరావు మాట్లాడారు. విభిన్న భాషల్లో నిరంతరం కృషి చేస్తున్న నలిమెల భాస్కర్‌కి మఖ్దూమ్ పురస్కారం ప్రదానం చేయడం ఎంతో సముచితమైన నిర్ణయమన్నారు. మన తెలంగాణ సంపాదకుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ..మఖ్దూమ్ పేరుతో ఒక జాతీయ పురస్కారాన్ని ఏర్పాటు చేసి, సాహితీవేత్తలకు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ..స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం గురించి మఖ్దూమ్ చూపిన బాటలో అందరం నడవాలన్నారు. అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ..నలిమెల భాస్కర్ చిన్న వయసు నుంచే పద్య కవిత్వంతో పాటు వచన సాహిత్యంలో కూడా మంచి ప్రతిభ కనబరిచారని, నవలలు కూడా రాశారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ..సిటీ కాలేజ్ పూర్వ అధ్యాపకుడైన మఖ్దూమ్ పేరుతో జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహితీ వేత్తలకు 2019 నుంచి పురస్కారం ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం బహుభాషావేత్త నలిమెల భాస్కర్‌కు అందించడం అవార్డు గౌరవాన్ని పెంచిందన్నారు. ఈ కార్యక్రమాన్ని అవార్డు కమిటీ కన్వీనర్ డా.విప్లవ్ దత్ శుక్లా, సభ్యులు డా.యాదయ్య, డా.కోయి కోటేశ్వరావులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ డా.వెల్చాల కొండలరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, అడిషనల్ కలెక్టర్ శ్యామ్ లాల్, వాహేద్, కవయిత్రి విమల, కరీంనగర్ సాహితీ సోపతి మిత్రులు డా.బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, పొన్నం రవిచంద్ర, కందుకూరి అంజయ్య పాల్గొన్నారు.


విద్యార్థులకు అపార్ ఐడీ కార్డు తప్పనిసరి

గోల్కొండ: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అపార్ ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలని గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించారు. ఆయన అపార్ కార్డు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రయోజనాలను వివరించారు. అపార్ ఐడీ కార్డులో విద్యార్థి చదువుతో పాటు అకాడమిక్ వివరాలు ఉంటాయన్నారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది జాఖేర్, అఖిల్, తిరుపతి తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీరుద్దీన్

శివస్వాములపై పోలీసుల దాడి దారుణం



ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: శ్రీశైలంలో శివస్వాములపై పోలీసులు దాడి చేయడం దారుణమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. శ్రీశైలం దేవస్థానానికి వెళ్లిన శివస్వాములపై దాడిచేసిన పోలీసులపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజాసింగ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. శ్రీశైలం దేవస్థానానికి దర్శనానికి వెళ్తున్న శివస్వాములు ఒక దుకాణదారుడితో వాగ్వాదం కాగా అక్కడే ఉన్న పోలీసులు శివస్వాములపై ఎలా లాఠీ చార్జి చేసి దాడి చేస్తారని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డీజీపీ స్పందించి దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మ్యాన్‌హోళ్లకు మూతలు ఏర్పాటు చేయాలి



శాలిబండ: శాలిబండ నుంచి ఖాజీపురా వెళ్లే ప్రధాన రహదారిలో మూతలు లేకుండా ఉన్న మ్యాన్‌హోళ్ల ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మ్యాన్‌హోళ్లకు మరమ్మతులను చేపట్టిన సంబంధిత అధికారులు వాటికి మూతలు ఏర్పాటు చేయలేదు. ఈ మ్యాన్‌హోళ్లు పూర్తిగా దగ్గరికి వచ్చేంత వరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మ్యాన్‌హోళ్లకు మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.